బాబు మోసాలను ఎండగడదాం

- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడిచెరువు: చంద్రబాబు నాయుడి మోసాలను ఎండగడదామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఓడీచెరువులోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఓడీచెరువు, అమడగూరు, నల్లమాడ మండలాల వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత నాలుగున్నరేళ్లగా సీఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యంగా గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి, ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చారని తెలిపారు. వలంటీర్ల ద్వారా ప్రతి పథకాన్ని నేరుగా ఇంటికే చేరుస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా నవరత్నాలను వంద శాతం అమలు చేసి, ఇచ్చిన మాట నిలుపుకున్నారని వెల్లడించారు. సీఎం చేసిన మేలును ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రజలకు తెలియజేయాలని సూచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశామన్నారు. ముఖ్యంగా 3 టీఎంసీల నీటిని నియోజకవర్గానికి తీసుకొచ్చామని పేర్కొన్నారు. అలాగే ప్రతి మండలంలోని మారుమూల గ్రామానికి తారురోడ్లను వేయించడమే కాకుండా కోట్లాది రూపాయల వ్యయంతో 3 నేషనల్ హైవేలను నియోజకవర్గానికి తీసుకొచ్చామని స్పష్టం చేశారు. మరీ ముఖ్యంగా పుట్టపర్తిని జిల్లా కేంద్రంగా తీసుకువచ్చి, ఈ ప్రాంతంలోని వారికి జీవనోపాధి కల్పించామన్నారు.

ఇంటింటికీ పథకాలను వివరించాలి..

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటుగా ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయ అనుబంధ కమిటీ సభ్యులతో అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రతి కుటుంబ సభ్యులకు తెలియపర్చాలన్నారు. అదేవిధంగా గత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన మోసాలను, అవినీతిని ప్రజలకు వివరించాలని చెప్పారు. ఆపు బాబు నీ నాటకం–జగనన్నే మా నమ్మకమని సులభరీతిలో వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు ఫరీ ష్ షామీర్‌బాషా, ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్లు రాజునాయుడు, సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద్‌రెడ్డి, సర్పంచ్ గోవిందు, సొసైటీ అధ్యక్షుడు శివారెడ్డి, మూడు మండలాల ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయాల అనుబంధ కమిటీ సభ్యులు చింతా వెంకటేష్, రామాంజులు, శ్రీనివాసరెడ్డి, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చౌడేశ్వరి దేవి ఆలయంలో పూజలు


అలంకరణలో చౌడేశ్వరి దేవి

తాడిమర్రి: మండలంలోని పెద్దకోట్ల గ్రామంలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి ముందుగా అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

ముస్లింల పక్షపాతి సీఎం జగన్


మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్

తలుపుల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డి.పయాజ్ అహమ్మద్ అన్నారు. ఆదివారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఎంపీపీ పదవితో పాటు, కన్వీనర్ పదవి సైతం మైనార్టీలకు ఇవ్వడం హర్షణీయమన్నారు. వైఎస్సార్‌సీపీకి మైనార్టీలు రుణపడి ఉంటారని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతను తూచా తప్పకుండా పాటిస్తానని పేర్కొన్నారు. అన్ని వర్గాలను కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. పార్టీ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. రెండవ సారి కన్వీనర్ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డికి రుణపడి ఉంటానన్నారు.

ఆర్థికసాయం అందజేత


బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం


కదిరి అర్బన్: మండల పరిధిలోని ఎరుకుల వాండ్లపల్లిలో సరస్వతి అనే మహిళకు చెందిన ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి ఆదివారం ఈ విషయాన్ని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే రూ.10 వేల ఆర్థికసాయాన్ని పంపించారు.

కదిరి అర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతిలోని స్విమ్స్ అసుపత్రిలో చికిత్స పొందుతున్న నిజాంవలీ కాలనీకి చెందిన గంగరాజుకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డా.బత్తల హరిప్రసాద్ ఆదివారం రూ.20 వేల ఆర్థికసాయం చేశారు. ఈ మొత్తాన్ని తన తండ్రి, మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వరెడ్డి, నాయకులు కేఎస్ బాహుద్దీన్, మహబూబ్‌బాషా, బీసీ నాయకులు సంపంగి గోవర్దన్, బాబా, నజీర్ పాల్గొన్నారు.

అన్నదానం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గొట్లూరు అనాథాశ్రమంలోని వృద్ధులు, అనాథలకు ఆదివారం బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి సిస్టర్స్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫాదర్ స్టీఫెన్, జాన్ రెడ్డి, చిన్నమ్మ, పోలేస్, మెర్లిన్, సబిత తదితరులు పాల్గొన్నారు.

చిత్రలింగేశ్వర స్వామికి క్షీరాభిషేకం


గోవు పాలతో వెళ్తున్న అర్చకులు

రొళ్ల: యాదవుల ఆరాధ్యం దైవం చిత్రలింగేశ్వరస్వామికి అర్చకులు ఘనంగా క్షీరాభిషేకం నిర్వహించారు. ఆదివారం గంతికల్లుగొల్లహట్టి గ్రామానికి చెందిన యాదవ కులస్తులు యత్తప్పస్వామి పేరు మీద ఊరి పొలిమేరలో వదిలిన ఆవుల నుంచి పాలను సేకరించి అందులో నెయ్యి, పెరుగు తయారు చేసుకోవడంతో పాటు తెల్లవారుజామున పాలను సేకరించుకుని ఆలయ గర్భగుడిలోకి తీసుకొచ్చారు. తర్వాత కుమ్మరి ఇంటి నుంచి కొత్తగా తెచ్చిన మూడు కుండల్లోకి పాలను పోసి వేర్వేరుగా పెరుగు, నెయ్యితో నింపిన కుండలకు కొత్త దుస్తులు, పూలతో అలంకరించారు. అనంతరం కుండలను తలపై పెట్టుకుని కాలినడకన సుమారు 40 కి.మీ దూరంలోని కర్ణాటక రాష్ట్రం లక్కనహళ్లి వద్దనున్న చిత్రలింగేశ్వరస్వామి పాళి వద్దకు చేరుకున్నారు. అనంతరం స్వామికి క్షీరాభిషేకం నిర్వహించారు.

నానో యూరియాతో అధిక దిగుబడి


మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి

తాడిమర్రి: రైతాంగం అభివృద్ధికి ఇఫ్కో కంపెనీ అందిస్తున్న నానో యూరియా, నానో డీఏపీ (లిక్విడ్)తో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధ్యమని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం ఇఫ్కో కంపెనీ ఫీల్డు ఆఫీసర్ మణికళ్యాణ్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఉషోదయరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఇఫ్కో కంపెనీ దేశంలోనే గొప్ప ఫర్టిలైజర్ కంపెనీ అన్నారు. రైతుల కోసం ఆవిష్కరణలు చేసిన నానో యూరియా, నానో డీఏపీలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం ఫీల్డు ఆఫీసర్ మణికళ్యాణ్ మాట్లాడుతూ.. అర లీటర్ నానో యూరియా ధర రూ.225 ఉంటుందని పేర్కొన్నారు. ఇది ఒక బస్తా యూరియాతో సమానమని తెలిపారు. అలాగే అరలీటర్ డీఏపీ రూ.600 మాత్రమే అని, ఇది కూడా ఒక బస్తా డీఏపీతో సమానమని వెల్లడించారు. పొడి రూపంలో ఉన్న యూరియా కాని డీఏపీ కాని శ్రమపడి బస్తాల్లో తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. లిక్విడ్ రూపంలో ఉన్న వాటిని తీసుకెళ్లడం చాలా సులువు అన్నారు. అంతేకాక పొడి రూపంలో ఉన్న యూరియా, డీఏపీ ఒకసారి పంటలకు చల్లితే ఒక రోజులోనే దాని ప్రభావం పోతుందన్నారు. లిక్విడ్ రూపంలోని నానో యూరియా, డీఏపీలను పంటలకు స్ప్రే చేస్తే వాటి ప్రభావం 25 రోజుల నుంచి 30 రోజుల వరకూ ఉంటుందన్నారు. ఇవి పంటలకు వాడితే అధిక దిగుబడితో పాటు చీడపీడల బాధ తగ్గుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు పొరాళ్ల విజయ్ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ పుల్లయ్య, మదమంచి మల్లికార్జున నాయుడు, చిన్నగంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు కంటిచూపు ప్రసాదించడమే లక్ష్యం


దాతలను సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: నిరుపేదలకు కంటిచూపు ప్రసాదించడమే లక్ష్యమని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు వైద్య శిబిరానికి హాజరైన వారికి కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. సామాజిక సేవలో భాగంగా ప్రతి నెలా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తూ వందలాది మందికి కంటిచూపు ప్రసాదిస్తున్నామని తెలిపారు. దాతల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ వైద్య శిబిరంలో రోటరీ క్లబ్ కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్ గుప్త, నరేంద్రరెడ్డి, ఆర్గనైజర్లు సత్రసాల ప్రసన్న కుమార్, రమేష్‌బాబు, శివయ్య, సోలిగాళ్ల వెంకటేష్, బీవీ చలం, శ్రీనివాసరెడ్డి, నరేంద్రరెడ్డి, దాస్, రామిరెడ్డి, రామకృష్ణ, ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు నాగరత్నమ్మ, ఇన్నర్‌వీల్‌క్లబ్ ఐఎస్ఓ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌కు పాల్పడితే జైలు శిక్ష


మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటనారాయణ

గాండ్లపెంట: అసాంఘిక కార్యలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్‌ఐ వెంకటనారాయణ తెలిపారు. మండల పరిధిలోని మలమీదపల్లి గ్రామంలో ఆదివారం పోలీసులు పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ గ్రామస్తులతో మాట్లాడారు. పేకాట, మద్యం తదితర వాటి జోలికి వెళ్లకుండా ఉండాలని సూచించారు. ఎవరైనా గొడవలకు దిగితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో యువకులతో సమావేశం నిర్వహించారు. యువకులు క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. అదే విధంగా జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతుంటే సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. స్నేహపూరిత వాతవరణంలో క్రీడాస్ఫూర్తితో ఆడుకోవాలని హితువు పలికారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకెళ్తున్నాం


తంబాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజల హక్కులను పరిరక్షించగలమని, అందుకు ప్రజల సహకారం అవసరమని బత్తలపల్లి ఎస్‌ఐ పి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని సంగాల, జ్వాలాపురం, తంబాపురం గ్రామాల్లో సిబ్బందితో కలసి పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో బహిరంగ సమావేశాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల ఇబ్బందులు కలగకుండా పోలీసులకు సహకారం అందించాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో శాంతి భద్రతలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. చిన్న అవాంఛనీయ సంఘటన జరిగినా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలకు ఉపక్రమిస్తామన్నారు. పండుగ రోజుల్లో ఇతర ప్రాంతాల నుంచి కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరించి మోసాలకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. అలాంటి వారిని ప్రజలు నమ్మవద్దన్నారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తమ వద్దకే రావాలని సూచించారు.

ఆర్టీసీ డ్రైవర్ మృతి


బాలవీరుడు (ఫైల్)

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న బాలవీరుడు (54) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. వివరాలు.. బాలవీరుడు శనివారం విధులు ముగించుకుని స్వగ్రామం తలుపులకు చేరుకున్నాడు. తీవ్రమైన శ్వాస ఇబ్బందితో బాధపడుతూ చికిత్స అందేలోపు మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అంత్యక్రియల నిమిత్తం రూ.1,500 ఆర్థికసాయాన్ని డీఎం మైనుద్దీన్ కుటుంబ సభ్యులకు అందజేశారు. బాలవీరుడి మృతికి అసిస్టెంట్ మేనేజర్లు హరిమోహన్, హరిత, నాయకులు బైరిశెట్టి, ఎస్పీ రమణ, ఉత్తన్న తదితరులు నివాళులు అర్పించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

మడకశిరరూరల్: అనంతపురం జిల్లాలో శనివారం నిర్వహించిన అండర్ 19 క్రీడా పోటీల్లో నీలకంఠాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని పీఈటీ రాజేష్ ఆదివారం తెలిపారు. అనంతపురంలోని ఆర్ఎన్ రైఫిల్ షూటింగ్ అకాడమీలో రాష్ట్ర ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయన్నారు. రైఫిల్ షూటింగ్‌లో రాజు, పీప్‌సైట్‌లో ప్రజ్వల్, గణేష్, ఓపెన్‌సైట్‌లో శాలిని, పిస్టల్‌లో గిరిక ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు త్వరలో రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పాఠశాల హెచ్ఎం చంద్రమౌళి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

పెద్దమ్మ దేవతకు ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న అమ్మవారు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పెద్దమ్మ దేవతకు ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వర్షాలు బాగా కురవాలని కోరుతూ భక్తులు బోనాలు సమర్పించారు.

విజయవాడ తరలిన ప్రజాప్రతినిధులు


అనంతపురంలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నుంచి వాహనాల్లో తరలుతున్న ప్రతినిధులు

కనగానపల్లి: విజయవాడలో సోమవారం జరగనున్న వైఎస్సార్‌సీపీ సభకు నియోజక వర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆదివారం సాయంత్రం బయల్దేరి వెళ్లారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు. పార్టీలోని వివిధ విభాగాల నాయకులు తరలివెళ్లారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

కనగానపల్లి: మండలంలోని దాదులూరులో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్డీ అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద నిర్వహించనున్న కార్యక్రమం ద్వారా ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి, ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.

నేడు 'స్పందన'

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరిదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదే విధంగా మండలస్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతిపత్రాలను అందజేయాలని సూచించారు.

తాడిమర్రి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం, మండలంలోని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో మండల అధికారులు, సచివాలయాల సిబ్బంది హాజరు కావాలని ఆదేశించారు.

ఖాదీ వస్త్రాలనే వాడాలి


ర్యాలీ చేస్తున్న ఖాదీ సొసైటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: ప్రతి ఒక్కరూ ఖాదీ వస్త్రాలనే వాడాలని ఖాదీ సొసైటీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ఖాదీ మహోత్సవం సందర్భంగా పట్టణంలోని పురవీధుల్లో ఆదివారం గ్రామోద్యోగ ఖాదీ సిల్క్ సొసైటీ కార్యదర్శి ఆధ్వర్యంలో సిబ్బంది, విద్యార్థులు, స్థానికులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్రం ఆదేశాల మేరకు ఖాదీ మహోత్సవాన్ని అక్టోబర్ 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో ఖాదీ వస్త్రంపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామని తెలిపారు. ఖాదీ వస్త్రాలనే వాడాలే ప్రజలకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించాలి


ప్రజలకు సూచనలిస్తున్న ఎస్‌ఐ సురేష్ బాబు

కొత్తచెరువు: ప్రజలు గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలి. ఎటువంటి ఘర్షణలకు అవకాశం ఇవ్వొద్దని ఎస్‌ఐ సురేష్ బాబు సూచించారు. ఆదివారం మండలంలోని లింగారెడ్డిపల్లి, ధర్మవరం రహదారి ప్రాంతాల్లో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో అందరూ కలసికట్టుగా ఉండాలన్నారు. ఏ చిన్న సమస్య తలెత్తినా వాటిని అందరూ కూర్చొని పరిష్కరించుకోవాలని తెలిపారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు ఎవరైనా సంచరించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు.

ఇద్దరికి గాయాలు

గోరంట్ల: మండలంలోని ఖాజాపురం సమీపంలో గోరంట్ల – పుట్టపర్తి రోడ్డుపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. మండలపల్లి గోపాలమిత్రగా పని చేస్తున్న రంగ్గానాయక్‌తో పాటు మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై గోరంట్లకు వెళ్తున్నారు. ఇదే సమయంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ఈప్రమాదంలో రంగ్గానాయక్ తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు.

జోరుగా ప్రభుత్వ భవనాల నిర్మాణం


పూర్తయిన జగరాజుపల్లి సచివాలయం


ప్రజలకు సేవలందిస్తున్న రైతు భరోసా కేంద్రం


బత్తలపల్లి వైఎస్సార్ హెల్త్ క్లినిక్

- ఇప్పటికే 12 భవనాల పూర్తి
- త్వరలో అందుబాటులోకి మరిన్ని భవనాలు
- రూ.7.36 కోట్లతో పనులు

పుట్టపర్తి అర్బన్: గాంధీజీ కలలగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. గ్రామ పంచాయతీల్లో పక్కా భవనాలు నిర్మించి సేవలను మరింత చేరువ చేస్తోంది. వైఎస్ జగన్ సీఎంగా పగ్గాలు చేపట్టిన తర్వాత ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ తనదైన శైలిలో ముందుకెళ్తున్నారు. ప్రజలకు పథకాలను చేరువ చేయడానికి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. సంక్షేమ పథకాలను గడప వద్దకే అందించేందుకు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. కోట్లాది రూపాయలు వెచ్చించి సచివాలయం, ఆర్బీకే, హెల్త్‌క్లినిక్ ఇలా పక్కా భవనాలను నిర్మిస్తోంది.

త్వరలో ప్రారంభానికి కసరత్తు..

పుట్టపర్తి మండలంలో 52 గ్రామాలు 10 సచివాలయాలు ఉండగా వాటిలో రూ.7.36 కోట్ల వ్యయంతో సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు తదితర ప్రాధాన్యత భవనాలను ప్రభుత్వం నిర్మిస్తోంది. మండల వ్యాప్తంగా 10 సచివాలయాలు, 9 రైతు భరోసా కేంద్రాలు, 8 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు కలిపి 27 భవనాలు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం జగరాజుపల్లి, చెర్లోపల్లి, పెడపల్లి–2, నిడిమామిడి, గంగిరెడ్డిపల్లి ,వెంకటారిపల్లిలో 6 సచివాలయాలు, జగరాజుపల్లి, చెర్లోపల్లి, వెంకటగారిపల్లిలో 3 రైతు భరోసా కేంద్రాలు, వెంకటగారిపల్లి, పెడపల్లి–2, చెర్లోపల్లిలో 3 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇందులో జగరాజుపల్లిలో సచివాలయంతో పాటు రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు, ఒక్కో రైతు భరోసా కేంద్రాన్ని రూ.21.80 లక్షలు, ఒక్కో హెల్త్ క్లినిక్‌ను రూ.17.5 లక్షలతో నిర్మిస్తున్నారు. ప్రాధాన్యతా భవన నిర్మాణాల విషయంలో కలెక్టర్ అరుణ్‌బాబు ప్రతి వారం అధికారులకు లక్ష్యాలను నిర్దేశించి నిర్మాణాలు వేగవంతం చేస్తున్నారు. పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి క్షేత్రస్థాయి పర్యటనలతో పనులను వేగంగా పూర్తి చేయిస్తున్నారు. ఇందుకు సంబంధించిన బిల్లులు సైతం ఎప్పటికప్పుడు వేగంగా చెల్లించేలా వేగవంతం చేయడానికి అధికారులను పురమాయిస్తున్నారు. ఎప్పటికప్పుడు బిల్లులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

గ్రామాల్లోనే సేవలు..

ప్రభుత్వం గ్రామాల్లో నిర్మిస్తున్న సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. గ్రామ ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లు, వ్యవసాయ సూచనలు, విత్తనాలు, మందులు, పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పని లేదు. సచివాలయాలు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.కోటి విలువైన భవనాల రూపంలో స్థిరాస్తులను అందించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. సీఎం వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉంటే ఇలాంటి ఎన్నో కార్యక్రమాలతో రాష్ట్రం ముందుకెళ్తుంది.

– సూర్యనారాయణరెడ్డి, జగరాజుపల్లి

మడకశిరపై ధర్మవరం విజయం


ఏపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అండర్–15 విభాగంలో మిక్స్‌డ్ ఏపీఎల్ క్రికెట్ లీగ్ మ్యాచ్ జరిగింది. ధర్మవరం, మడకశిర మధ్య జరిగిన మ్యాచ్‌ను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు నాగేంద్ర ప్రారంభించారు. మడకశిర జట్టుపై ధర్మవరం జట్టు విజయం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. కోచ్‌లు విజయ్, రాజశేఖర్, సీనియర్ క్రీడాకారుడు వేణు తదితరులు పాల్గొన్నారు.